క్లుప్తంగా

విద్యార్థులకు మెరుగైన విద్య
ఓబులవారిపల్లె : ఏపీఎండీసీ పాఠశాల ద్వారా విద్యార్థులకు మెరుగైన కార్పొరేట్ విద్యను అందిస్తామని ఏపీఎండీసీ డైరెక్టర్ వీరప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. ఏపీఎండీసీ గనులను, పాఠశాలను ఆయన పరిశీలించారు. సీపీఓ సుదర్శన్ రెడ్డితో పలు అంశాలపై చర్చించారు.

బాధ్యతల స్వీకరణ
రాయచోటి : ఏపీఎస్పీడీసీఎల్ రాయచోటి ఏడీఈగా చాంద్‌బాషా మంగళవారం డివిజన్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

దరఖాస్తుల ఆహ్వానం
రాజంపేట టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హులై, ఆసక్తికలిగిన అభ్యర్థులు ఈనెల 25వ తేదీ కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు నేరుగా హాజరు కావచ్చని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పురుషోత్తం తెలిపారు. పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్/కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టుల్లో పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు.

బోర్డు మెంబర్‌గా మలిశెట్టి
చిట్వేలి : రాష్ట్ర కనీస వేతనాల అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా చిట్వేలి మండల వాసి మలిశెట్టి వెంకటరమణ నియమితులయ్యారు.

పుస్తకావిష్కరణ
రాజంపేట : ఏఐటీఎస్‌లో సీఎస్ఈ హెచ్ఓడీ డాక్టర్ సుబ్బారావు రచించిన మిషన్ లెర్నింగ్ పుస్తకాన్ని ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి ఆవిష్కరించారు. రచయిత డాక్టర్ సుబ్బారావు, ప్రిన్సిపాల్ నారాయణ పాల్గొన్నారు.

ఈ- పంట నమోదు తనిఖీ
సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లె, ఎస్.రాజంపేట గ్రామాల్లో ఈ- పంట నమోదు వివరాలను క్షేత్ర స్థాయిలో రైతుల పొలాల్లో తనిఖీ చేసినట్లు బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎం. నాగరాజ తెలిపారు.

ముగిసిన పవిత్రోత్సవాలు
ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయంలో ఈ నెల 16న ప్రారంభమైన పవిత్రోత్సవాలు సోమవారంతో ముగిశాయి. మూడు రోజులుగా యాగశాలలో వేదపండితులు వీణారాఘవాచార్యులు హోమాలు నిర్వహించారు.

ఎస్పీతో ఎమ్మెల్యే మేడా భేటీ
రాజంపేట : కడప ఎస్పీగా నూతనంగా బాధ్యతలు తీసుకున్న సిద్దార్థ్ కౌశల్‌ను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి మంగళవారం కలిశారు. ఎస్పీకి శాలువా కప్పి సత్కరించారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర డైరెక్టర్లు ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

బస్సు సర్వీసు ఏర్పాటు
రామాపురం : రాయచోటి నుంచి నీలకంఠ్రావుపేట మీదుగా కడపకు ఉదయం, సాయంత్రం రెండు మార్లు బస్సు సర్వీసు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్సు ఏర్పాటు చేయించారు.

పోరాట ఫలితమే రిజర్వేషన్లు
రాయచోటి అర్బన్ : మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు సీపీఐ మాజీ ఎంపీ గీతాముఖర్జీ పోరాట ఫలితమే అని ఏపీ మహిళాసమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుమిత్ర అన్నారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గీతా ముఖర్జీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

మొబైల్ ఆధార్ క్యాంపులు
సిద్దవటం : మండలంలో బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. 20న మాచుపల్లె సచివాలయంలో, 21న వంతాటిపల్లి సచివాలయంలో, 22, 23 తేదీలలో సిద్దవటం సచివాలయంలో క్యాంపులు నిర్వహిస్తారన్నారు.

ప్రోత్సాహక బహుమతులు
రామాపురం : మండలంలోని హసనాపురం పంచాయతీ కొండావాండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు విశ్రాంత లెక్చరర్ కొవ్వూరు ఈశ్వర్‌రెడ్డి నగదు ప్రోత్సాహక బహుమతులను అందించారు.

తాగునీటి సమస్య పరిష్కారం
వీరబల్లె (రాయచోటిటౌన్) : మట్లి పంచాయతీ పుల్లంరాజుగారిపల్లెలో తాగునీటి సమస్య ఉందని తెలియగానే బోరు వేసి తాగునీటి సమస్య పరిష్కరించినట్లు సర్పంచ్ సోమారపు నాగార్జునాచారి తెలిపారు.

పార్లమెంటులో చర్చించాలి
రాయచోటి అర్బన్ : కౌలురైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో చర్చించాలని రాష్ట్ర కౌలు రైతుల సంఘం నేత వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

శ్రీ వీరభద్రస్వామి జయంతి
రాయచోటిటౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారి జయంతి పూజలు అత్యంత భక్తి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారిని దర్శించుకున్నారు.

వైద్యుడు, ఫార్మసిస్టు కీలకం
రాజంపేట : సమాజ ఆరోగ్యానికి వైద్యుడు, ఫార్మసిస్టు కీలకమని కడప ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ రాజు అన్నారు. మంగళవారం ఏఐటీఎస్ ఫార్మసీ కళాశాలలో మూడో జాతీయ ఫార్మసీ వారోత్సవాలు-2023 నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలత మాట్లాడారు.

మహా గణపతి..మనసా స్మరామి





రాజంపేట టౌన్ : పూజలు చేస్తున్న ఆకేపాటి, పోలా, ప్రత్యేక అలంకరణలో వరసిద్ధి వినాయకుడు



రాజంపేట : వినాయక ఉత్సవాల మండపాలకు విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట టౌన్ : వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో గణనాథుని విగ్రహాలను ఉత్సవ కమిటీ సభ్యులు కొలువు దీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చవితి ఉత్సవాలను పురస్కరించుకొని ఆయా ఉత్సవ కమిటీలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు అన్నదాన కార్యక్రమాలు చేపడుతుండటం, ప్రజలకు ఆట విడుపు కలిగించేందుకు వివిధ పోటీలు నిర్వహిస్తుండటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుండటంతో ఎటు చూసినా కోలాహలం నెలకొంది. కసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డినగర్‌లో ప్రసిద్ధి గాంచిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో పెద్దఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాజంపేట పట్టణంలోని సరస్వతీపురం వీధిలో వినాయక చవితి సందర్భంగా తిరుపతికి చెందిన వెంకటేశ్వర భాగవతార్‌చే నిర్వహించిన హరికథా కాలక్షేపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

ప్రత్యేక పూజలు చేసిన ఆకేపాటి, పోలా

వినాయక చవితి పండుగ రోజున పట్టణంలోని శివాలయం సెంటర్‌లో దాసరి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

రాజంపేట మండలంలో..

రాజంపేట రూరల్ : మండల పరిధిలో గణపతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణంలోని ఎగువగడ్డ వీధిలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు కె సురేష్, బిల్లా నరేష్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, డీలర్ సుబ్బరామిరెడ్డి, బొల్లినేని రామ్మోహన్ నాయుడు, దాసరి పెంచలయ్య, సానిపాయి రమణ, మల్లికార్జున, కృష్ణకాంత్, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో..

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండలంలో వినాయక చవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. ఒంటిమిట్ట అరుంధతి కాలనీలో చలువ పందిళ్లతో మండపాన్ని ఏర్పాటు చేసి, భారీ గణేషుని విగ్రహాన్ని ప్రతిష్టించారు. విగ్రహదాత మొదుగుల పెంచలయ్యను సన్మానించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి

- ఎమ్మెల్యే మేడా

రాజంపేట : రాజంపేట నియోజకవర్గంలో గణనాథుని ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. సోమవారం మేడాభవన్‌లో ఎమ్మెల్యేను కలిసిన వినాయక మండపాల నిర్వాహకులకు రూ.40వేలకుపైగా విరాళాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యాన్ని పాటిస్తూ నేటి యువత ముందుకెళ్లాలన్నారు. ఉత్సవాల్లో మద్యం సేవించడం, ఘర్షణలకు దిగడం లాంటి చర్యలకు దూరంగా ఉండాలన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కృష్ణారావు యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువత విభాగం సంయుక్త కార్యదర్శి తంబల వేణుగోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ గంగిరెడ్డి, శివరాంజు, రాంనగర్ శివ, మురళచారీ,సుబ్రమణ్యంనాయుడు పాల్గొన్నారు.

నందలూరులో...

నాగిరెడ్డిపల్లె అర్బన్ పరిధిలోని అరవపల్లె క్రీడా మైదానం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలోని స్వామిని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్ అమీర్, సర్పంచ్ జంబు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటంలో..

సిద్దవటం : మండలంలోని అన్ని గ్రామాలలో వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసి ఘనంగా పూజలు నిర్వహించారు. వేద పండితులు వినాయక స్వామి కథను భక్తులకు చదివి వినిపించారు.



సిద్దవటం : పెద్దపల్లి పంచాయతీ కొత్త హరిజనవాడలో..



రాజంపేట : గణనాథునికి పూజలు చేస్తున్న నందలూరు ఎంపీపీ



ఒంటిమిట్ట : గణేష్ విగ్రహం వద్ద అరుంధతి కాలనీ ప్రజలతో దాత

రైల్వేకోడూరు నియోజకవర్గంలో..



రైల్వేకోడూరు: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గణపతి విగ్రహం వద్ద ప్రభుత్వవిప్ పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గణనాథుడి విగ్రహానికి ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు సుఖశాంతులను అందించాలని, ప్రజలందరినీ చల్లగా చూడాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించారు. అనంతరం మండలంలోని పలు ప్రాంతాలలో ప్రతిష్టించిన వినాయక విగ్రహాలను దర్శించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి, ప్రముఖ న్యాయవాది ఆర్‌సి సురేష్‌బాబు, పంజం సందీప్ రెడ్డి, మండల నాగేంద్ర, సుధాకర్‌రాజు, మాజీ జెడ్పీటీసీ మారెల్ల రాజేశ్వరి, సీహెచ్ రమేష్, శివయ్య, రౌఫ్, ఇనమాల మహేష్, క్రిష్ణారెడ్డి, మారెల్ల చందు తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె మండలంలో..

ఓబులవారిపల్లె : ఓబులవారిపల్లి సమీప గ్రామాలైన మంగంపేట, వై.కోట తదితర గ్రామాలలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. మంగంపేట ఆర్‌ఆర్-1లో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తల్లెం రమణారెడ్డి వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. డీఆర్‌సీసీయూ మెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి మంగంపేట పునరావాస కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకునికి పూజలు చేశారు.

పుల్లంపేట మండలంలో..

పుల్లంపేట : మండల పరిధిలోని కేతరాజుపల్లి గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ యూత్ లీడర్ ముద్దా రామసుబ్బారెడ్డి, నాగిరెడ్డి సుదర్శన్ రెడ్డి, నలమారు సుదర్శన్ రెడ్డిలు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

సిద్దీబుద్దిక్ ఆలయంలో

పెనగలూరు : పెనగలూరు పంచాయతీ ఇండ్లూరు గ్రామంలో సిద్దీబుద్దిక్ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. మహిళలు విరివిగా పాల్గొని కుంకుమ పూజ చేశారు. అలాగే కొత్తపల్లి వినాయక మండపంలో నిలువెత్తు వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు.

చిట్వేలి మండలంలో..

చిట్వేలి : మండల వ్యాప్తంగా 101 ప్రాంతాలలో వినాయక విగ్రహాలను ప్రతిష్టించారు. పలు గ్రామాలలో మధ్యాహ్నం అన్నదానం చేశారు. గ్రామ పెద్దలు, యువకులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఒబులవారిపల్లె : మంగంపేట ఆర్‌ఆర్-1లో పూజలు చేస్తున్న తల్లెం రమణారెడ్డి



పుల్లంపేట : వినాయక స్వామిని దర్శించున్న ముద్దా రామసుబ్బారెడ్డి, తదితరులు



పెనగలూరు : సిద్దీబుద్దిక్ ఆలయంలో పూజలు అందుకుంటున్న వినాయకుడు



చిట్వేలి: వైఎస్సార్ సర్కిల్ వద్ద మండపంలో యువకులు

సుఖసంతోషాలు వెల్లివిరియాలి



చిన్నమండెం బలిజపల్లెలో కొలువైన గణనాథుడు



లక్కిరెడ్డిపల్లి : పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి



సంబేపల్లి మండల కేంద్రంలో పూజలు అందుకుంటున్న గణేషుడు

లక్కిరెడ్డిపల్లి : వర్షాలు కురిసి ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. లక్కిరెడ్డిపల్లె మూడు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఆయన ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్యలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గురుస్వామి, రమణ, టైపిస్టు రమణలు వీరికి స్వాగతం పలికారు.

సంప్రదాయాలకు ప్రతీకలు పండుగలు

రామాపురం : భక్తి, సంప్రదాయాలకు ప్రతీక పండుగలు అని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలో సోమవారం వినాయక ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. మండలంలోని పాత రామాపురంలో 15 అడుగుల భారీ ప్రతిమకు జెడ్పీటీసీ మాసన వెంకటరమణ గ్రామస్తులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. కర్ణపువాండ్లపల్లెలో లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి కుటుంబ సభ్యులు గ్రామస్తులతో కలిసి గణేష్ ప్రతిమను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. కొత్త రామాపురంలో సర్పంచ్ అయోధ్యపురం నాగభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజలు జరిపారు.

సంబేపల్లి మండలంలో..

సంబేపల్లి : సకల విఘ్నాలను తొలగించే దేవాది దేవుడు విఘ్నేశ్వరుడని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణు వర్దన్ రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణనాథులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో భక్తి భావాన్ని పెంపొందించేలా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం : మండల వ్యాప్తంగా వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పేదల జీవితాల్లో ఆనందం చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి



నూతన పెన్షన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : పేదల జీవితాలలో ఆనందం చూడాలన్నదే జగన్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయంలో నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హత ఉన్న వారందరికీ ఈ ప్రభుత్వంలో పెన్షన్లు అందుతున్నాయన్నారు. పేదలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటున్నందుకా ప్రతిపక్షాలు సీఎంను సైకో అంటున్నది అని ప్రశ్నించారు. రాయచోటిని జిల్లా కేంద్రం చేయడం, వంద పడకల ఆసుపత్రి, బస్టాండ్ విస్తరణ, రైతు బజార్ తదితర అభివృద్ధి పనులు చేసినందుకా సీఎం జగన్‌ను విమర్శిస్తున్నది అని నిలదీశారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో చంద్రబాబు అడ్డంగా దొరికారని పేర్కొన్నారు. ఆ ఫైలులో చంద్రబాబు పదమూడు చోట్ల సంతకాలు చేశారన్నారు. సీఎం జగన్ ప్రజలను నమ్ముకుంటే చంద్రబాబు పొత్తులను నమ్ముకున్నారని చెప్పారు.

వెలిగల్లు కాలువల ద్వారా వీలైనన్ని చెరువులను నింపుతాం

వెలిగల్లు కాలువలు ద్వారా గాలివీడు, లక్కిరెడ్డిపల్లి, రామాపురం మండలాలోని చెరువులను వీలైనన్నింటిని నీటితో నింపుతామని ఎమ్మెల్యే తెలిపారు. సంక్రాంతి వరకు నీటిని విడుదల చేస్తామన్నారు. ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ కులం, మతం, వర్గం లేకుండా అర్హతే ఆధారంగా జగన్ పాలనలో సంక్షేమ పథకాలు అందుతుండడం గొప్ప విషయమన్నారు. మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య మాట్లాడారు. మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్, ఉప మండలాధ్యక్షుడు సమరసింహారెడ్డి, సుబ్బరాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు ఆసరాగా సీఎం జగన్

రాయచోటి అర్బన్ : అవ్వాతాతలకు సీఎం వైఎస్ జగన్ ఆసరాగా నిలిచారని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటి ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండలానికి నూతనంగా మంజూరైన పెన్షన్‌లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గానికి మొత్తం 2271 నూతన పెన్షన్‌లు మంజూరయ్యాయన్నారు. జగన్ పాలనలో అర్హతే ప్రామాణికంగా అర్హులందరికి పెన్షన్‌లు అందుతున్నాయన్నారు. పల్లపు రమేష్, తిరుపాల్‌నాయుడు, కౌన్సిలర్ నరసింహారెడ్డి , ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, వైస్ ఎంపీపీ జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామ రాజ్యంలా జగన్ పాలన

గాలివీడు: రామ రాజ్యంలా సీఎం జగన్ పాలన సాగుతోందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం గాలివీడులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ ఒక్క పెన్షన్ తొలగించకుండా కొత్త పెన్షన్‌ను మంజూరు చేసి వైఎస్ జగన్ పేదల పక్షపాతి అని నిరూపించుకున్నారన్నారు. ఎంపీపీ పద్మావతమ్మ, సీనియర్ నాయకులు ఖాదర్‌మొహిద్దీన్(ఎస్‌కే), మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆవుల నాగభూషణ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గాలి శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ బండి చిన్నరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో ఎంతో అభివృద్ధి

రామాపురం : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిల సహకారంతో రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రామాపురంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి శూన్యమన్నారు. ప్రస్తుతం గ్రామాలలో సీసీ రోడ్లను నిర్మించారని, రాయచోటి పట్టణంలో 100 పడకల ఆసుపత్రిని, లక్కిరెడ్డిపల్లెలో 50 పడకల ఆసుపత్రిని నిర్మించారన్నారు. ప్రతి గ్రామానికి తాగునీటి సమస్యను తీర్చిన ఘనత ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి దేనన్నారు.

సమస్యకు శాశ్వత పరిష్కారమే ధ్యేయం

- నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు(రాజంపేట) : మండలంలో సమస్యలకు శాశ్వత పరిష్కారమే తన ధ్యేయమని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. నాగిరెడ్డిపల్లె మేజర్‌పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో రూ.8లక్షలతో నిర్మితమైన సులభ్ కాంప్లెక్స్‌ను సోమవారం ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నందలూరు బస్టాండు సర్కిల్‌లో దశాబ్దాలుగా ప్రయాణికులను పట్టిపీడిస్తున్న సమస్యను పరిష్కరించామన్నారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి నేతృత్వంలో శాశ్వత అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్ అమీర్, ఎంపీటీసీ పునగాని వెంకటసుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు నడివీధి సుధాకర్, మోహన్‌రెడ్డి, సోమిశెట్టి ప్రభాకర్, పునగాని గుణయాదవ్, దళిత నాయకులు నాగసుబ్బయ్య, కాకిచంద్ర, ఎముక దుర్గయ్య, అఖిల్. వడ్డెర సంఘం నాయకుడు ఓర్సు శ్రీను, మైనార్టీ నాయకులు మున్వర్‌బాషా, మైనుద్దీన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పల్లె మాధవి తదితరులు పాల్గొన్నారు.

మానవతావాది పాలనలో స్వర్ణయుగం

- ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్

రైల్వేకోడూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయవేత్తగా కాకుండా మానవతావాదిలా కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అనంతరాజుపేట పంచాయతీలోని ఏటిగడ్డ హరిజనవాడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను దిగ్విజయంగా అమలు చేసి, పేదలకు ఆర్థిక భద్రత, భరోసా కల్పించే దిశగా సీఎం జగనన్న అడుగులు వేస్తున్నారని పేర్కొన్నారు. ద్రోహానికి చంద్రబాబు మారుపేరైతే, విశ్వసనీయతకు బ్రాండ్ అంబాసిడర్ సీఎం జగన్ అని అభివర్ణించారు. స్వర్ణయుగాన్ని తలపించేలా పాలన అందిస్తూ, ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, యువనాయకులు పంజం సందీప్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, జెడ్పీటీసీ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

పెనగలూరు : పెనగలూరు మండలానికి ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వీరు పాల్గొంటారన్నారు.